సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



వెండి చీరకు విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలాంబపురంలో ముత్యాలమ్మవారి వెండి చీర నిమిత్తం వట్టి సత్యనారాయణమూర్తి, గంగా కిషోర్ రూ.20 వేలు విరాళంగా అందజేశారు.



కలలు చెదిరి.. కన్నీరే మిగిలి

పట్టిసం శివరాత్రి ఉత్సవాలకు వచ్చిన ముగ్గురు యువకులు గోదావరి పుణ్యస్నానాలకు దిగి మృత్యువాత పడ్డారు. వీరంతా తూర్పుగోదావరి జిల్లా వారు. 8లో



కూలీలపైకి దూసుకెళ్లిన బస్సు

భీమడోలు మండలం పూళ్ల శివారు జాతీయ రహదారి పక్కన ఉన్న నలుగురు కూలీలపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లగా ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. 8లో

న్యూస్‌రీల్

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

సాక్షి, భీమవరం: జిల్లాలో రబీ సీజన్‌లో సాగునీటికి ఇబ్బందులు తొలగించేలా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటుచేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ట్రోల్‌ఫ్రీ 08816–234197, ఉండి సబ్ డివిజన్‌కు సంబంధించి 9490350791, తణుకు సబ్ డివిజన్‌కు సంబంధించి 9849326829, నరసాపురం సబ్‌డివిజన్‌కు సంబంధించి 96033 92009 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున పంటలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా వారాబందీ పద్ధతి ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. వంతులవారీ షెడ్యూల్ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉందని, ఈ మేరకు నీటిని వినియోగించుకోవాలని సూచించారు. వారాబందీ ప్రకారం నీరు సక్రమంగా అందకపోతే టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

'పోలవరం' పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శనివారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, స్పిల్‌వే, పవర్ హౌస్ నిర్మాణ ప్రాంతాలను పరిశీలించి, పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ఈఈ ఆదిరెడ్డి, మేఘ ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధి పి.మురళి ఆయన వెంట ఉన్నారు.

పట్టిసం క్షేత్ర సందర్శన

పట్టిసం క్షేత్రంలో వీరేశ్వరస్వామిని కలెక్టర్ దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్సై పరీక్షలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో శనివారం ఏలూరు సీఆర్‌ఆర్ అటానమస్ కాలేజీ ఆడిటోరియంలో పరీక్షల ఏర్పాట్లపై ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ దిశానిర్దేశం చేశారు. పరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని అధికారులు సూచించారు. జిల్లాలో 9,014 మంది అభ్యర్థులకు 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఏలూరు, పరిసర ప్రాంతాల్లో కేంద్రాలను సిద్ధం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డును తీసుకురావాలి. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ పరికరాలకు అనుమతి లేదు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఈ-కేవైసీ

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ఈనెల 20వ తేదీలోపు ఈ-కేవైసీ పూర్తిచేసుకోవాలని వ్యవసాయ ఉప సంచాలకుడు పి.మురళీకృష్ణ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం మండలంలో 78 శాతం, పెంటపాడు మండలంలో 82 శాతం ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

నాగేంద్రహారాయ.. నమశ్శివాయ



పట్టిసంలో గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

- మార్మోగిన శివనామస్మరణలు
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



వీరంపాలెంలో స్ఫటిక లింగానికి అభిషేకాలు చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



భీమవరంలో ఉమాసోమేశ్వరుడికి అభిషేకాలు

భీమవరం(ప్రకాశం చౌక్): హరోంహర.. శంభోశంకర స్మరణలు మార్మోగాయి.. అభిషేకప్రియుడి దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. మహాశివరాత్రి పర్వదినాన ఆదిభిక్షువు సేవలో తరించి ఆనందించారు. పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దనస్వామి ఆలయానికి (సోమారామం) వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు విశేష రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. గర్భగుడిలోకి బయట అర్చకులు రావడంపై దేవదాయశాఖ డీసీ జయరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారిని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు, న్యాయమూర్తి సోని, దేవదాయ శాఖ ఆర్‌జేసీ సురేష్ బాబు తదితరులు దర్శించుకున్నారు.

పుణ్యప్రదం.. స్ఫటిక లింగ దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెంలోని బాలాత్రిపురసుందరీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో స్ఫటిక లింగ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున స్ఫటిక లింగానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ దంపతులు అభిషేకాలు, హోమగుండం వద్ద పూజలు నిర్వహించారు. ఆకాశ లింగానికి (మహాదేవుడు) హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావు 12 రకాల నదీ జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు, ఉత్తరప్రదేశ్ డీజీపీ స్వామిని దర్శించుకున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.

ఓం నమో వీరేశ్వరాయ

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి ఆలయంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుమారు 1.50 లక్షల మంది స్వామిని దర్శించుకున్నట్టు అంచనా. గోదావరిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అటు తూర్పుగోదావరి జిల్లా వంగలపూడి నుంచి ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై.. ఇటు పట్టిసం రేవు నుంచి పంటు మార్గంలో క్షేత్రానికి చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక తిన్నెలపై తిరునాళ్లను చూసేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త కె.వీరభద్రరావు కుటుంబసభ్యుల అభిషేకాల అనంతరం రాత్రి 2 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతిచ్చారు. పలువురు భక్తులు పితృదేవతలకు పిండప్రదానాలు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది. క్షేత్రం వద్ద భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.ఝాన్సీరాణి, డీఎస్పీ కె.లతాకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షీరారామం.. మోక్షధామం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. వేకువజాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి కనిపించింది. రాత్రి 8.35 గంటలకు జగజ్జ్యోతి వెలిగించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామివారికి మల్లన్న పాగా అలంకరించారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు ఆలయ అధికారులు అంచనా వేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భీమవరంలోని సోమారామంలో క్యూలైన్లలో భక్తులు



పాలకొల్లులో అభిషేకాలు



పాలకొల్లు క్షీరారామంలో భక్తులు

మనసున్న మా'రాజు'కు కన్నీటి వీడ్కోలు





సర్రాజు పార్థీవదేహం వద్ద గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు చిత్రంలో శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, అంతిమయాత్ర ర్యాలీ

- ఉండి మాజీ ఎమ్మెల్యే, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు కన్నుమూత
- ఉండి, భీమవరంలో విషాదఛాయలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పేర్ని నాని, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు

సాక్షి, భీమవరం/కాళ్ల: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు (72) శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. భీమవరంలోని ఆదర్శనగర్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుకు గురికావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. సర్రాజుకు భార్య అన్నపూర్ణ, కుమారులు శ్రీనివాసరాజు, యుగంధర్‌నాగవర్మ ఉన్నారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శనగర్‌లోని సర్రాజు నివాసానికి చేరుకుని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. సర్రాజు మృతి వార్త తెలియగానే ఉండి నియోజకవర్గం, భీమవరం పట్టణంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. సర్రాజు నివాసానికి జిల్లా నలుమూలల నుంచి రాజకీయనాయకులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి నివాళులర్పించారు. మనసున్న మారాజుగా, సేవాతత్పరతతో నియోజకవర్గ అభివృద్ధికి సర్రాజు విశేషంగా కృషిచేశారని పలువురు అన్నారు.

ప్రముఖుల నివాళి

సర్రాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దాడిశెట్టి రాజా, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీప్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, భీమవరం, ఆచంట, ఉంగుటూరు, మచిలీపట్నం, కైకలూరు, ఉండి ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పుప్పాల వాసుబాబు, పేర్ని వెంకట్రామయ్య (నాని), దూలం నాగేశ్వరరావు, మంతెన రామరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఐజీ జి.పాలరాజు, ఎస్పీ యు.రవిప్రకాష్, ఇన్‌చార్జ్ డీఆర్వో ఎం.సూర్యతేజ, ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, బ్రదర్ అనిల్‌కుమార్, ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంటరీ మహిళా కన్వీనర్ గూడూరి ఉమాబాల, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏఎస్ రాజు, గాదిరాజు సుబ్బరాజు, గోకరాజు రామరాజు తదితరులు ఉన్నారు.

జక్కరంలో అంత్యక్రియలు

ప్రభుత్వ అధికార లాంఛనాలతో పోలీసులు గౌరవ వందనం సమర్పించి సర్రాజు పార్థీవదేహంపై జాతీయ జెండా కప్పి గౌరవించారు. అనంతరం పార్థీవదేహాన్ని ర్యాలీగా కాళ్ల మండలంలోని జక్కరం గ్రామానికి తీసుకువెళ్లి హిందూ శ్మశాన వాటికలో దహనం చేశారు. భీమవరం ఆర్డీఓ దాసి రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. కాళ్ల జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు తదితరులు ఉన్నారు.

ఆయన మృదుస్వభావి

కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం



తాడేపల్లిగూడెం అర్బన్: పాతపాటి సర్రాజు ఆకస్మిక మృతికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల సర్రాజు తనను కలిసి ఆప్యాయంగా పలకించారని గుర్తుచేశారు. ఆయన సౌమ్యుడు, మృదుస్వభావి, స్నేహశీలి అని అన్నారు. ఉండి నియోజకవర్గ అభివృద్ధికి సర్రాజు అందించిన సేవలు మరువలేమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నా రాజకీయ గురువు

పీవీఎల్ నరసింహరాజు, డీసీసీబీ చైర్మన్



కాళ్ల: పాతపాటి సర్రాజు తన రాజకీయ గురువు అని, ఆయన మరణం తీరని లోటని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. విదేశాల్లో ఉన్న పీవీఎల్ ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. తనకు రాజకీయాన్ని నేర్పించి భవిష్యత్తును ఇచ్చిన సర్రాజుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నియోజవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు తోడుగా ఉంటూ పార్టీని ముందుకు తీసుకువెళతానని అన్నారు. ఆయన మరణం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

తీవ్ర దిగ్భ్రాంతి

తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

బుట్టాయగూడెం: పాతపాటి సర్రాజు అకాల మరణంతో దిగ్భ్రాంతి చెందానని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సర్రాజుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు దేవుడు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

భక్తజన సాగరం.. బలివే క్షేత్రం



బలివే క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



రామలింగేశ్వర స్వామి

పెదవేగి/ముసునూరు: మహాశివరాత్రి పర్వదినాన బలివే క్షేత్రం భక్తజన సంద్రాన్ని తలపించింది. లక్షలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయంలో రామలింగేశ్వరస్వామికి వేకువజాము 2 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా చేరుకున్న భక్తులు జల్లుస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. పలువురు పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. మూడు లక్షలకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ ఈఓ సి.జయప్రకాష్ తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్యచౌదరి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యే కొఠారి ఆధ్వర్యంలో సుమారు 50 వేల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, సర్పంచ్ రావు ప్రవీణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగేశ్వరరావు, నోడల్ అధికారి, తహసీల్దార్ దాసరి సుధ ఆలయం, టి.విశ్వేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ లీకై పెంకుటిల్లు దగ్ధం



మారంపల్లిలో దగ్ధమవుతున్న పెంకుటిల్లు

తాడేపల్లిగూడెం రూరల్ : గ్యాస్ సిలిండర్ లీకై సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు పోర్షన్ల పెంకుటిల్లు దగ్ధమైందని తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి జీవీ రామారావు తెలిపారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి శివాలయం సమీపంలో మొండి రాజా గణేష్‌కు చెందిన పెంకుటిల్లు ఈ ప్రమాదంలో ధ్వంసమైందన్నారు. సుమారు రూ.6 లక్షలు ఆస్తినష్టం ఉంటుందని తెలిపారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్, గ్రామ సర్పంచ్ సరిపల్లి పద్మ, శివాలయం కమిటీ చైర్మన్ కల్లేపల్లి కృష్ణంరాజు, గెడ్డం మోషే తదితరులు పరామర్శించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

పాలకోడేరు: అప్పుల బాధ తాళలేక భీమవరానికి చెందిన నడింపల్లి సతీష్‌రాజు (44) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. బయట అప్పు చేసి, వేరే వ్యక్తులకు అప్పు ఇచ్చిన సతీష్‌రాజు ఇచ్చిన బాకీలు వసూలు అవ్వక, చేసిన అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురై శుక్రవారం విస్సాకోడేరు పైపుల చెరువు రోడ్‌లో పురుగుమందు తాగి సమాచారం భార్యకు చెప్పాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

కూలీలపై దూసుకెళ్లిన బస్సు

- ముగ్గురి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు
- చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు
- న్యాయం కోసం బాధిత కుటుంబాల ఆందోళన
- ఆర్టీసీ డిపో మేనేజర్ హామీతో విరమణ





పూళ్ల శివారు జాతీయ రహదారిపై చెల్లా చెదురుగా పడిన మృతదేహాలు, ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

భీమడోలు: ఆర్టీసీ డ్రైవర్ అతివేగం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. రోడ్డు పక్కన మాట్లాడుకుంటున్న నలుగురి కూలీలపై బస్సు దూసుకువెళ్లింది. దీంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ దుర్ఘటన జాతీయ రహదారి ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల సమీపంలో శనివారం ఉదయం 12 గంటల సమయంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి ఉటూకూరి ఫణీంద్ర (29), రోజువారీ కూలి పనులు చేసుకునే దంద్రు వీరాస్వామి (60), కర్నాటి మహేంద్ర (32), గండికోట శ్రీనులు జాతీయ రహదారిపై పూళ్ల శివారు కోడూరుపాడు వద్ద పాత కలప కొనుగోలు చేసేందుకు రెండు బైక్‌లపై షాపు వద్దకు వచ్చారు. పని నిమిత్తం రోడ్డు పక్కనే మాట్లాడుకుంటున్న ఆ నలుగురిపై నుంచి భీమవరం నుంచి ద్వారకాతిరుమల వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి అతివేగంగా దూసుకెళ్లింది. ఓ బైకు బస్సు అడుగు ఇర్కుపోయింది. వీరాస్వామి, మహేంద్రలు అక్కడిక్కడే మృతి చెందాడు. ఫణీంద్ర, శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్‌లో భీమడోలు తరలిస్తుండగా ఫణీంద్ర మృతి చెందాడు. శ్రీనును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలను అందిస్తున్నారు.

బాధితుల రాస్తారోకో..
గంటకుపైగా స్తంభించిన ట్రాఫిక్

న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలంలో బైఠాయించారు. బారికేడ్లు అడ్డుపెట్టడంతో గంటకు పైగా రోడ్డుపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.గిరిధర్‌తో సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్సై చావా సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గ్రామ పెద్ద గన్ని గోపాలరావు తదితరులతో చర్చించారు. బాధిత కుటుంబాలకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, నష్టపరిహారం, మట్టి ఖర్చుల నిమిత్తం నగదు ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. వైఎస్సార్ బీమా వస్తుందని సత్యశ్రీనివాస్ బాధితులకు తెలిపారు. ఎస్సై సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తుచేపట్టామని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై సురేష్‌కుమార్ తెలిపారు.

శోకసంద్రంలో కురెళ్లగూడెం

కురెళ్లగూడెంలో విషాదచాయలు అమలుకున్నాయి. బస్సు ప్రమాదం రెక్కాడితేగాని డొక్కాడని ఆ పేద కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. మహేంద్రకు ఒకపాప, ఆరు నెలల బాబు ఉన్నారు. మహేంద్ర తండ్రి మానసిక స్థితి బాగుండడం లేదు. తన కుటుంబంతో పాటు తల్లిదండ్రులను పోషిస్తోన్న మహేంద్ర మృతితో ఆ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫణీంద్రకు బాబు, పాప ఉన్నారు. వీరిలో ఒకరు అంగన్‌వాడీలో, ఒకరు నరసరి చదువున్నారు. వీరాస్వామికి భార్య ఉంది. తన ఇద్దరి కుమార్తెకు వివాహాలు చేశారు. ఆ ముగ్గురు మృతిని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.





ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాలు, బంధువులు, గ్రామస్తులు, గాయాలపాలైన గండికోట శ్రీను

కలలు చెదిరి.. కన్నీరే మిగిలి

- పట్టిసం ప్రమాదంతో దోసకాయలపల్లిలో విషాదం
- గోదావరిలో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం
- కంటికి కడివెడుగా రోదిస్తున్న కుటుంబ సభ్యులు



స్పీడ్ బోట్‌లతో గాలింపు చర్యలు చేస్తున్న ఫైర్ సిబ్బంది



రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

పోలవరం రూరల్: ఇంజినీర్ అయి కుటుంబాన్ని బాగా చూసుకోవాలని ఒకరు.. వ్యాపారంలో తండ్రికి తోడుగా ఉండాలని మరొకరు.. బాగా చదువుకుని కుటుంబానికి అండగా ఉండాలని ఇంకొకరు కలలు కన్నారు. అవి తీరకుండానే.. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చి.. ఆ యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. మహాశివరాత్రి పర్వదినాన ఏలూరు జిల్లా పట్టిసం పుణ్యక్షేత్రం వద్ద గోదావరిలో జరిగిన ఘోరం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. చేతికి అందివస్తారనుకున్న బిడ్డల బతుకులు అర్ధాంతరంగా గోదారి పాలవడంతో గుండెలు పగిలిన ఆ తల్లిదండ్రులు కంటికి కడివెడుగా రోదిస్తున్నారు.

కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన స్నేహితులైన ఏడుగురు యువకులు మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. అక్కడ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకుని, ఉత్సవాల్లో సరదాగా గడిపి తిరిగి వద్దామని అనుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట దాటిన తరువాత నదిలో స్నానానికి దిగారు. అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన స్నానఘట్టాల వద్ద కాకుండా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు లేని మరో ప్రదేశంలో స్నానానికి దిగారు. దీంతో అక్కడ నది లోతు ఎంతుందో వారికి తెలియలేదు. ఈ క్రమంలో ఎస్‌కే లుక్సేన్ (19), ఒలేటి అరవింద్ (20), పెదిరెడ్డి రాంప్రసాద్ (18) గల్లంతయ్యారు. మిగిలిన నలుగురు మిత్రులూ ఇచ్చిన సమాచారంతో పోలవరం పోలీసులు హుటాహుటిన స్పీడ్ బోట్లలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టి కొద్దిసేపటికే ముగ్గురి మృతదేహాలనూ వెలికితీశారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ హుటాహుటీన అక్కడకు బయలుదేరారు. ఉత్సవాలకు వచ్చిన తమ పిల్లలు క్షేమంగా తిరిగి వస్తారనుకుంటే, అర్ధాంతరంగా తమను వదిలి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారంటూ పెద్ద పెట్టున విలపించారు. చేతికి అందివచ్చిన కొడుకులను పోగొట్టుకున్న ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. మృతదేహాలను వెలికి తీసి పోలవరం ఎస్సై పవన్‌కుమార్ పీఎం నిమిత్తం పోలవరం వైద్యశాలకు తరలించారు.

కనులపండువగా మృత్యుంజయ మహాయజ్ఞం



గర్భాలయంలో నారసింహుడికి చందనాన్ని పూసి, దూపం వేస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన లక్ష్మీనరసింహ క్షేత్రంలో మృత్యుంజయ సంపుటిత సుదర్శన నృసింహ ధన్వంతరి 28వ మహా యజ్ఞం శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. సుదర్శన సంపుటితమైన 17 వేల రుద్రనామాలతో 1,331 కలశాలకు రుద్ర పూజను ఘనంగా చేశారు. ఏటా వలె హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురుజీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన రుత్వికులు పాల్గొని ఈ యజ్ఞ క్రతువును వైభవోపేతంగా నిర్వహించారు. లక్ష్మీ నారసింహునికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందని పండితులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పలు కార్యక్రమాలతో సుందరగిరి పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం విఘ్నేశ్వరపూజ, మండపారాధనలు, అనంతరం శాలిగ్రామ అభిషేకం, రుద్రపారాయణ, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్రనామ, లక్ష్మీ సహస్రనామ పారాయణలు, సూర్యనమస్కారాలను రుత్వికులు వేడుకగా నిర్వహించారు. ఆ తరువాత 1,331 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. కలశారాధన, విగ్రహ సుదర్శన ప్రతిష్ఠలు, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా యజ్ఞాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ రుత్వికులు తెల్లవార్లూ నిర్వహించారు. యజ్ఞకుండంలో ఔషధ లోహాలు వంటి పలు ద్రవ్యాలను వినియోగించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షించారు. యజ్ఞ కార్యక్రమంలో అశేష భక్తజనంతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు, హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీనారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్న లక్ష్మీ నరసింహ గురూజీ

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్ర జట్టు పయనం



జి కైలాష్‌రెడ్డి



దాసం దుర్గారావు



యడ్లపల్లి సూర్యనారాయణ

అత్తిలి: ఫిజికల్లీ చాలెంజెడ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు కేరళలో నిర్వహించే సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ జట్టు బయలుదేరి వెళ్లిందని ఆ జట్టు కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, గోవా, ఆంధ్ర జట్లు పాల్గొంటాయన్నారు. ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా జి.కైలాష్‌రెడ్డి (కర్నూలు), అత్తిలికి చెందిన దాసం దుర్గారావు క్రీడాకారునిగా, జట్టు మేనేజర్‌గా యడ్లపల్లి సూర్యనారాయణ ఎంపికయ్యారని సంఘ వ్యవస్థాపకుడు గొట్టుముక్కల రామలింగ సూర్యనారాయణరాజు తెలిపారు. ఆంధ్రా జట్టు విజయంతో తిరిగిరావాలని సంఘ గౌరవ అధ్యక్షుడు, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

రొయ్యల చెరువులో విష ప్రయోగం

ఉండి: ఉండి మండలం పాందువ్వ గ్రామ శివారు ప్రాంతం పాందువ్వ ఖండ్రికలో గుర్తు తెలియని వ్యక్తి విషపూరితమైన పురుగుల మందు రొయ్యల చెరువులో కలపడం ద్వారా రొయ్యలు మృత్యువాత పడ్డాయి. పాందువ్వ ఖండ్రికలో భీమవరానికి చెందిన పుప్పాల చంద్రశేఖమూర్తికి చెందిన నాలుగు ఎకరాల రొయ్యల చెరువును ఖండ్రికకు చెందిన జెట్టి శ్రీనివాస్ కౌలుకు సాగు చేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తన చెరువులో విషపూరితమైన పురుగుల మందు కలపడంతో సుమారు రూ.5 లక్షల విలువైన రొయ్యలు చనిపోయాయని, తనకు న్యాయం చేయాలంటూ రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.

సోమేశ్వరుని శివరాత్రి ఆదాయం రూ.4,81,250

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవం సందర్భంగా రూ.4,81,250 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఎస్.అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. పూజలకు రూ.33,100, లడ్డులకు రూ.33,750, దర్శనానికి రూ.4,14,400 వచ్చిందని వివరించారు.

సుబ్బారాయుడికి సర్పాభరణం



సుబ్రహ్మణ్యస్వామికి సర్పాభరణం తీసుకొస్తున్న దాత పుల్లయ్యనాయుడు

నిడమర్రు : మండలంలోని బువ్వనపల్లి వడలమ్మవారి ఆలయం వద్ద వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి గ్రామానికి చెందిన దాత సంకు పుల్లయ్యనాయుడు, సత్యనారాయణ సోదరులు సర్పాభరణం సమర్పించుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ చేసి అనంతరం స్వామి వారికి సర్పాభరణాన్ని అలంకరించారు. ప్రధాన దాత పుల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుప్పాల కన్నబాబు, సంకు సత్యకుమార్, సంకు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వల్లూరుపల్లిలో ఘనంగా శనిత్రయోదశి పూజలు


ఆలయంలో తైలాభిషేకం చేస్తున్న అర్చకులు

పెంటపాడు: మహాశివరాత్రి, శనిత్రయోదశి పురస్కరించుకొని ఉభయగోదావరి జిల్లాలో ఏకైక శనీశ్వర ఆలయంగా వెలుగొందుతున్న వల్లూరుపల్లి మందేశ్వరుడు(శనైశ్చరుడు) ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. భారీ సంఖ్యలో మందేశ్వరుని తైలాభిషేకం జరిగింది. సుమారు 600 మందికి పైగా భక్తులు శనిదోషనివారణ పూజలు చేయించుకొన్నారు. ఆలయ ఈవో చీమలకొండ సాయి, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా కర్నాటక బ్యాంకు 100వ వార్షికోత్సవం


తణుకులో వేడుకలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

తణుకు: కర్నాటక బ్యాంకు 100వ వార్షికోత్సవ వేడుకలను తణుకులోని స్థానిక వేల్పూరు రోడ్డులోని బ్యాంకు శాఖలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తేజ సీఫుడ్స్, బెజవాడ లైట్ హౌస్ అధినేత బెజవాడ సూర్య, వేదనిధి బ్యాంకు చైర్మన్ వివేకానంద స్వామి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. బ్రాంచి మేనేజర్ గణేషన్ గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.ఎస్.జ్యూయలరీ అధినేత సోమేశ్వరరావు, న్యాయవాది విద్యాలంకార్, ఆర్యవైశ్య సేవా సంఘం కోశాధికారి మన్యం అప్పారావు, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వశిష్ట లియో క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోవశిష్ట లియో క్లబ్ చేస్తున్న సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని లయన్స్‌క్లబ్ లయన్ గట్టిం మాణిక్యాలరావు పేర్కొన్నారు. గట్టిం చికాగో పర్యటన పూర్తిచేసి వచ్చిన సందర్భంగా డైమండ్స్ లయన్స్ క్లబ్ ఫాస్ట్ చైర్మన్ విశిష్ట లియో క్లబ్ అడ్వయిజర్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో గట్టింకు అభినందనలు తెలిపారు. లియో కోశాధికారి సాయిశృతి సౌజన్యంతో స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. లియో అధ్యక్ష కార్యదర్శులు మాధురి, సంపత్‌లు ఆధ్వర్యంలో వహించారు. ఆలయ కమిటి కార్యదర్శి గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచనలు చేశారు. లియో క్లబ్ ద్వారా సేవలందించి ఉన్నతస్థాయికి చేరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల వెంకటస్వామి, దేవరాజ్‌రెడ్డి, శానం గోవిందు, మునగాల జితేంద్ర, పట్నాల రామకృష్ణ, గట్టిం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

తాడేపల్లిగూడెం అర్బన్: మహాశివారాత్రి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ పీఎంజెఎఫ్ పదంకుమార్ గుప్తా ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో భారీ అన్నసమారాదన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగపండు రామ్మోహనరావు, డాక్టర్ ఎల్ఎస్‌వి నాగేశ్వరరావు, మదన్మోహనల్ అగర్వాల్, సుంకర శ్రీనివాసు, పడాల మహేశ్వరరావు, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద వితరణ

మహా శివరాత్రిని పురస్కరించుకొని నంది బొమ్మ సెంటరులోని ఆలపాటి శ్రీనివాసు ఆయన స్వగృహం వద్ద పులిహోర ప్రసాద వితరణ శనివారం చేశారు. మహాశివుడు అందరికి శుభం కలిగించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో దాతలు కెఎస్‌డి ప్రసాద్, చలంచర్ల సరభేశ్వరరావు, బాలాజి, ఆలపాటి కేధార్నాథ్, ఆలపాటి శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోడూరు: క్షయవ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని హెల్త్ సూపర్‌వైజర్ జయమణి హెచ్చరించారు. పెనుమదం గ్రామంలో శనివారం క్షయవ్యాధిపట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయమణి మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గు, దగ్గినపుడు కళ్లెతో పాటు రక్తపు చారలు కనిపించడం, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధి కావచ్చనీ, కాబట్టి ఈ లక్షణాలు కనిపించినపుడు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఒకవేళ క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఏ మాత్రం ఆందోళన చెందవద్దనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎం సుబ్బాయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ వై.శ్రీధర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- స్పటిక లింగానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అభిషేకాలు
- క్యూలైన్లో బారులు తీరిన జనం


వీరంపాలెం శివాలయంలోని విశ్వేశ్వరస్వామిని విశేషంగా అలంకరించిన దృశ్యం


మహా శివరాత్రి సందర్భంగా తేతలిలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


మహాదేవునికి అభిషేకాలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మల్లిఖార్జునరావు


విశ్వేశ్వరుడిని దర్శించేందుకు క్యూకట్టిన భక్తులు


అత్తిలి కుమ్మరవీధిలో విశేష అలంకరణలో శ్రీసోమేశ్వరస్వామి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో రెండవ దక్షిణ కాశీగా వెలుగొందుతున్న వీరంపాలెం శైవక్షేత్రం శనివారం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి, శనిత్రయోదశి పర్వదినాలు సందర్భంగా తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి క్యూకట్టారు. తొలుత తెల్లవారు జామున స్పటిక లింగేశ్వరునికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు అభిషేకాలు నిర్వహించారు. అలాగే, ఆలయ ప్రాంగణంలోని హోమ గుండం వద్ద పూజలు నిర్వహించి, అనంతరం ఆకాశ లింగానికి (మహాదేవునికి) హైకోర్టు న్యాయమూర్తి మల్లిఖార్జునరావు, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ యువ నేత కొట్టు విశాల్ దేశంలోని 12 రకాల నదీ జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు, ఉత్తరప్రదేశ్ డీజీపీతో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిదులు స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వీరంపాలెం శివాలయానికి చేరుకున్నారు. దీంతో గ్రామానికి వెళ్ళే రహదారులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. క్యూలైన్లో భక్తులు బారులు తీరి కనిపించారు. భక్తులకు సేవాదళ్ సిబ్బంది మంచినీరు, పులిహోర, చిన్నారులకు పాలు అందజేశారు. వచ్చిన భక్తులు వచ్చినట్టుగానే స్వామివారి దర్శనం చేసుకుని బయటకు వెళ్ళేలా రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్.మూర్తి, ఎస్సై వీఎస్.వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, ఆలయ సేవాదళ్ సభ్యులు చర్యలు చేపట్టారు. శైవక్షేత్రానికి తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్ సరీ్వసులను నడపటంతో పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ళవెంకటరమణ శాస్త్రి - విజయలక్ష్మి, కుమారుడు సందీప్ - కావ్య, కుమార్తె హారిక దంపతులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అలాగే, మండలంలోని కుంచనపల్లి, కొండ్రుప్రోలు, పెదతాడేపల్లి, మాధవరం, అప్పారావుపేట, జగన్నాథపురం, నవాబుపాలెం, మారంపల్లి, కృష్ణాయపాలెం, పట్టింపాలెం, ఆరుళ్ళ, రామన్నగూడెం గ్రామాల్లోని శివాలయాల్లోనూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కడియద్ద, నీలాద్రిపురం గ్రామాల్లోని శివాలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

ఇరగవరంలో: మండలంలోని ఇరగవరం, తూర్పువిప్పర్రు, గోటేరు, కంతేరు, కొత్తపాడు, కత్తవపాడు, రాపాక, రేలంగి, కె ఇల్లిందలపర్రు, గ్రామాల్లో వేంచేసి ఉన్నా శివాలయల్లో మహ శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం తీర్ధ ప్రసాదలు స్వీకరించారు.

తణుకు టౌన్‌లో : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తణుకు మండలంలోని వేల్పూరు, తేతలి, పైడిపర్రు, మండపాక, కోనాల, దువ్వ గ్రామాల్లోని శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయాల వద్ద స్వామివార్లకు కల్యాణోత్సవాలు నిర్వహించారు. శనివారం వేకువ జాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాయంత్రం తేతలి గ్రామంలో స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాద వితరణ:

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తణుకులోని శ్రీ ఉమాసిద్దేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకునే భక్తులకు వాసవి వనితా వైభవం క్లబ్ సభ్యులు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వేదకుమారి, కార్యదర్శి జల్లూరి సుజాత, కోశాదికారి గూడూరి గీత, వాసవి రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు జవ్వాది వీరభద్రయ్య, కార్యదర్శి కందుల చంద్రమౌళి గుప్త, కోశాదికారి కట్టమూరి మురళీ, జోన్ ఆఫీసర్ గుడిమెట్ల రాజేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ జల్లూరి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో : మహ శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి. హర హర శంకర శంభో శంకర అంటూ భక్తుల శివనామస్మరణతో మారుమ్రోగాయి. శనివారం వేకువ జామునుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తి స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. అత్తిలి గ్రామంలో వేంచేసియున్న

వైభవంగా శివరాత్రి పూజలు


పెంటపాడులో రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని పలు శివాలయాల్లో శనివారం శివరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. పెంటపాడులోని మిడ్‌లెవిల్ కాలువగట్టున ఉన్న పార్వతిసమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేసారు. రాత్రి జ్యోతిర్లింగార్చన చేసారు. ఆలయట్రస్టీ కొవ్వూరి లక్ష్మణరెడ్డి, గౌరవ అధ్యక్షులు దాసరి అప్పన్నలు తదితరులు పర్యవేక్షణలో పూజలు జరిగాయి. చరిత్రప్రసిద్ధి గాంచిన మీనవల్లూరు శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయం, దర్శిపర్రు బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆల యంలో తెల్లవారు జాము నుంచే భక్తులు దర్శనాలకు పోటిత్తారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసారు. రామచంద్రపురం, కొండేపాడు, కోమర్రు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేసారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీల అందజేత


కె ఇల్లిందలపర్రులో కుర్చీలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందల పర్రు గ్రామంలోని రెండో నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం కుర్చీలు, ఫ్యాన్లు అందించడం జరిగిందని సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి12 కుర్చీలు, 4ఫ్యాన్లు అందజేశామని తెలిపారు. అనంతరం మల్లిరెడ్డి నాగార్జున మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అందరికీ తమకు చేతనైన సహయాం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పథకాలను అందజేయాలన్నారు. ఎంపీటీసీ కాంత కుమారి, వార్డు నెంబరు మజ్జి సౌందర్య , వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామంలో గ్యాస్ లీకై సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన మొండి రాజాగణేష్ కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వపరంగా తహసీల్దార్ వైకేవీ.అప్పారావు రూ.5వేలు నగదు, 25 కిలోల బియ్యం, గ్రామ సర్పంచ్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, నిడదవోలు నవోదయ గ్యాస్ ఏజెన్సీ వారు కొత్త గ్యాస్ కనెక్షన్, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ కల్లేపల్లి కృష్ణంరాజు, సొసైటీ మాజీ డైరెక్టర్ కల్లేపల్లి లక్ష్మీపతిరాజు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ అహ్మద్, పాస్టర్ గెడ్డం మోషే తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శనివారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, ఒక కోడి పుంజును, రూ.2150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

పెనుమర్రులో..

యలమంచిలి: మండలంలోని పెనుమర్రు గ్రామ శివారున వరి చేలగట్ల వద్ద కోడి పందేలు వేస్తున్నారనే సమాచారంపై శనివారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు వేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.9300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ ఆర్.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు


శివదేవునిచిక్కాల శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన శివదేవునిచిక్కాలలో శివాలయ ఆవరణలో భక్తుల కోసం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాకర్స్‌క్లబ్ ర్యాలి శుభ, సభ్యుల విరాళంతో శ్రీరామ పరదేశి నాగసాయి కోలాట భజన బృందం గురువు తంగెళ్ల చిన్న ఆధ్వర్యంలో కోలాట భజన చేసి అలరించారు. అలాగే సంస్కృతి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచార్య పీఎస్ ప్రసాద్ శిష్య బృందం చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. భక్త బృందంతో భజన గీతాలు ఆలపించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి కంచు గంట సమర్పణ

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు గట్టుపై పునర్నిర్మితమవుతున్న వల్లీ దేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి కంచు గంటను మోటిపల్లి సూర్యనారాయణ శనివారం సమర్పించారు. సుమారు 600 ఏళ్ల నాటి పురాతన ఆలయాన్ని భక్తుల ఆర్థిక సహకారంతో అత్యంత వైభవంగా నిర్మిస్తున్నారు. నూతన ఆలయంలో రూ. 23 వేల వ్యయంతో కంచు గంటను ఆయన ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి జంపన సుబ్రహ్మణ్య రాజు(జేఎస్సార్)కు అందజేశారు. కార్యక్రమంలో కిమిడి నాగరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

21న ఎక్సైజ్ వాహనాల వేలం

సాక్షి,భీమవరం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన 4 ద్విచక్ర వాహనాలను భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో 21న బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ వెంట తెచ్చుకోవాలని సూచించారు. పాటదారులు తాము పాడుకున్న ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీని చెల్లించాలని, సొమ్ము మొత్తం అదే రోజు ప్రభుత్వానికి చలానా రూపంలో జమ చేయాలని సూచించారు.

వైభవంగా రామకోటి ఉత్సవాలు


శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్ర నామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీపురం ఆర్‌వీ సుబ్రహ్మణ్యం దంపతులచే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వమించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 4.30 గంటల నుంచి శివపార్వతుల కల్యాణ మహోత్సవం నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వర రావు దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు మాడా రామారావు దంపతుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 8.30 గంటల నుంచి నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి పార్వతి రామచంద్రన్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ పర్యవేక్షించారు.

ఒత్తిడిని తట్టుకోగల శక్తి ధ్యానమే


మాట్లాడుతున్న ఆత్మానందమయి అమ్మ

సాక్షి, భీమవరం: ఒత్తిడిని తట్టుకోగల శక్తి, నైపుణ్యం, మానసిక ప్రశాంతతను కలుగజేసే ప్రక్రియ ఒక్క ధ్యానమేనని ఆధ్యాత్మిక గురువు ఆత్మానందమయి అమ్మ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా భీమవరం వివిఎస్ గార్డెన్స్‌లో దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ పౌండేషన్, అంతర్జాతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ధ్యాన, మహారుద్రం,లింగోధ్భవ ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక, భావపూర్ణ, సామాజిక, ఆధ్యాత్మిక స్వస్థతను సాధించవచ్చునని, యోగ అంతర చైతన్యాన్ని, ఉత్సాహాన్ని, ప్రేరణను, అందించటంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనానికి నాంది పలుకుతుందని అన్నారు. ఒత్తిడిని నివారించి సామర్థ్యాన్ని నేర్పును పెంపొందిస్తుందని, ప్రతి ఒక్కరూ ఎంతో సులభంగా సాధన చేసే మహత్తర ప్రక్రియ యోగా అని అన్నారు. కార్యక్రమంలో విష్ణు కళాశాల చైర్మన్ కెవి రాజు, పౌండేషన్ ప్రెసిడెంట్ ఎస్ ప్రశాంతి, డాక్టర్ మధుశ్రీ, డాక్టర్ శ్రుతి కీర్తి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైవీ రావు మృతి తీరని లోటు

నరసాపురం: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు మృతి కార్మికులకు తీరని లోటని ఆసంఘం నరసాపురం డిపో యూనియన్ నాయకులు అన్నారు. వైవీ రావు సంతాప కార్యక్రమాన్ని శనివారం డిపో గేట్ వద్ద నిర్వహించారు. వైవీ రావు కార్మికుల ప్రయోజనాల కోసమే అనుక్షణం పనిచేశారని అన్నారు. ఆయన లోటు కార్మికులకు తీరని నష్టమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నరసాపురం డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి.స్టీవెన్‌రాజు, ఎస్‌పీవీ ప్రసాద్, ఏఎస్ రావు, సీహెచ్ శేషగిరి, డి.శివాజీ పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేకాలంకరణ

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులుస్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం కావడంతో భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా రథోత్సవాలు


లక్ష్మణేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


నగరేశ్వరునికి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మణేశ్వరంలోని శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామివారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకు వచ్చి రథంలో ఉంచారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. రథోత్సవానికి ముందు కుంభం పోసి స్వామివారికి నైవేధ్యం చూపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు యలమంచిలి ప్రసాదశర్మ, ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు,ఈఓ చాగంటి సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

పెనుగొండలో: ఓం న మఃశ్శివాయ నామస్మరణతో పెనుగొండ మండలంలో శివాలయాలు హోరెత్తాయి. శనివారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు అన్ని భక్తులతో కిటకిటలాడాయి, పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, ఉమామహేశ్వర స్వామి ఆలయం, ఉమాఏకాంబరేశ్వర ఆలయం, చెరుకువాడలో ఉమా విశ్వేశ్వరస్వామి ఆలయం, సిద్ధాంతంలో కేదారేశ్వర, నందీశ్వర స్వామి దేవలో చంద్రశేఖర ఆలయం, ఇలపర్రులో శివాలయం, వడలిలోని అగస్తేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు భారులు తీరారు. తెల్లవారు జాం నుంచి అభిషేకంలు నిర్వహించి, శివలింగాలను అలంకరించారు. సిద్ధాంతంలో వీరభద్రుని ప్రభల సంబరం కనుల పండుగగా నిర్వహించారు. పెనుగొండ నగరేశ్వరుని రథోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట రామకృష్ణ మోహనరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ ఎస్ శ్రీనివాస్, ట్రస్టీలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.